**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

**సంప్రదించ వలసిన నెంబర్:**

**7095999737,9908103501**



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:04 ఎడిటర్: రాపోలు లింగస్వామి 28 -08 -2026 శుక్రవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


# రాఖీ పండుగ శుభాకాంక్షలు



## అన్నా చెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

తెలంగాణ, జ్యోతి ప్రభంజనం:రక్షాబంధన్ (రాఖీ) పండుగను పురస్కరించుకుని జ్యోతి ప్రభంజనం తెలుగు జాతీయ దినపత్రిక ఎడిటర్, ప్రముఖ సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సోదరభావం, మానవతా విలువలను మరింత పెంపొందించాలని కోరుకున్నారు.? రాపోలు లింగస్వామిఎడిటర్, జ్యోతి ప్రభంజనం తెలుగు జాతీయ దినపత్రికసామాజిక కార్యకర్త

# ధాన్యం నిల్వకు తెలంగాణ సర్కార్ భారీ ప్లాన్

హైదరాబాద్: తెలంగాణలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం




సేకరణకు అనుగుణంగా ఆధునిక నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆధునిక ధాన్య సైలోలను నిర్మించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి ఈ అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో ధాన్యం నిల్వ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయ గోదాములపై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కొత్తగా నిర్మించే సైలోల ద్వారా అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**రబీలో 90 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు సన్నద్ధత**

రానున్న రబీ సీజన్‌లో రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ముందస్తు నిల్వ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.

**ఆధునిక సాంకేతికతతో సైలోలు**

కొత్తగా ఏర్పాటు చేయనున్న సైలోల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ వ్యవస్థలు, యాంత్రిక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. నిల్వ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో ధాన్యంలో తేమ, పురుగులు, ఇతర కారణాల వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రధానమంత్రి మోదీ మొన్న 20 భారతీయ స్పేస్-టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, సీఈఓలతో సమావేశమయ్యారు.

**వాటిలో ప్రతి ఒక్క స్టార్ట్ అప్ ఏమి చేస్తుందో చూద్దాం**



:1. స్కైరూట్ ఏరోస్పేస్ : చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనాలు (విక్రమ్ సిరీస్ రాకెట్లు)

2. అగ్నికుల్ కాస్మోస్ :
3ఆ-ప్రింటెడ్ ఇంజన్లు + పునర్వినియోగ సామర్థ్యంతో కూడిన ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనాలు3. పిక్సెల్ : హైపర్‌స్పెక్ట్రల్ భూ పరిశీలన ఉపగ్రహాల సమూహం

4. ధ్రువ స్పేస్ : ఫుల్-స్టాక్ చిన్న ఉపగ్రహ ప్లాట్‌ఫామ్‌లు, తయారీ మిషన్ పరిష్కారాలు

5. గెలాక్సీ : బహుళ-సెన్సార్ (ఆప్టికల్ ) భూ పరిశీలన ఉపగ్రహాలు

6. పియర్‌సైట్ : సముద్ర నిఘా కోసం సింథటిక్ అపర్చర్ రాడార్ ఉపగ్రహాలు

7. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ : ఎలక్ట్రిక్ కెమికల్ ఉపగ్రహ చోదక వ్యవస్థలు8. దిగంతర : స్పేస్ సిచుయేషనల్ అవేరెనెస్ / స్పేస్ డొమైన్ అవేరెనెస్ శిథిలాల ట్రాకింగ్

9. సాట్‌ష్యూర్ : ఉపగ్రహ డేటా అనలిటిక్స్ ఓ డెసిషన్ ఇంటెలిజెన్స్ (వ్యవసాయం, ఫైనాన్స్, మౌలిక సదుపాయాలు)

10. సుహోరా టెక్నాలజీస్ : బహుళ-సెన్సార్ ఉపగ్రహ డేటా సమీకరణ ప్లాట్‌ఫారమ్ విశ్లేషణలు (రక్షణ విపత్తు)

11. మనస్తు స్పేస్ : ఉపగ్రహాల కోసం పర్యావరణ అనుకూల (విషరహిత) చోదక వ్యవస్థలు

12. ఆస్ట్రోబేస్ : అధునాతన ఫుల్-ఫ్లో స్టేజ్డ్ కంబషన్ మీథేన్ రాకెట్ ఇంజన్లు

13. టేక్‌మీ2స్పేస్ : కక్ష్యలో కంప్యూట్ / ఎడ్జ్ కంప్యూటింగ్ ఆర్బిటల్ డేటా సెంటర్లు

14. వ్యోమిక్ : ఆధారిత పొజిషనింగ్, నావిగేషన్ టైమింగ్ ఉపగ్రహ కూటమి

15. కాస్మోసర్వ్ స్పేస్ : సాఫ్ట్ రోబోటిక్ క్యాప్చర్ ఉపయోగించి అంతరిక్ష శిధిలాలను చురుకుగా తొలగించడం

16. ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్ : కక్ష్యలో ఉపగ్రహ ఇంధన నింపడం జీవిత-పొడిగింపు సేవలు

# నేపాల్‌లో చిక్కుకున్న 23 మంది తెలంగాణ వాసుల గుర్తింపు

హైదరాబాద్: నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణకు చెందిన 23 మందిని ప్రాథమికంగా గుర్తించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వీరికి సంబంధించిన వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించినట్లు వెల్లడించారు. నేపాల్‌లో ఉన్న తెలంగాణ ప్రజల భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుం టోందని మంత్రి తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



**భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు**

నేపాల్ రాజధాని కాఠ్మాండులోని భారత రాయబార కార్యాలయంతో పాటు నేపాల్ అధికారులతో కూడా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసుల పరిస్థితి, వారి భద్రతకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు.

**ప్రత్యేక హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్**

తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోనూ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. బాధితుల కుటుంబాలకు అవసరమైన సమాచారం అందించేందుకు, సహాయక చర్యలను సమన్వయం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా పనిచేస్తోందని చెప్పారు. నేపాల్‌లో ఇంకా ఎవరైనా తెలంగాణకు చెందిన వారు చిక్కుకుని ఉంటే వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని మంత్రి కోరారు. బాధితుల వివరాలు అందిన వెంటనే వారి పరిస్థితిని తెలుసుకుని అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగలేటి తెలిపారు.

# కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి

హనుమకొండ: పాలిటెక్నిక్ విద్యార్థుల పట్లు ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. 97 జివోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాన విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకు ముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టిఎన్‌జివోలు నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు మద్దతు తెలిపారు. దీంతో పోలీసులు అయన్ను అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



# హైదరాబాద్ ఎన్ఎఫ్‌సీలో 432 అప్రెంటిస్ ఖాళీలు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ 432 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 16 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్ఎఫ్‌సీ భారత ప్రభుత్వ అణుశక్తి శాఖకు చెందిన సంస్థ.




**ఖాళీల వివరాలు**

ఐటీఐ ట్రేడ్ 432 ఖాళీలను ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, కెమికల్ ప్లాంట్ ఆపరేటర్, మెకానిక్, మోటార్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, కార్పెంటర్, ప్లంబర్, వెల్డర్ తదితర విభాగాల్లో నింపుతారు.

**అర్హతలు**

పదో తరగతితో ఉత్తీర్ణతో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. 18 నుంచి 27 ఏండ్ల వయసు ఉండాలి.

**ఎంపిక**

రాత పరీక్ష ఉండదు. నిర్దేశించిన ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఉంటుంది. అంటే ఇంటర్వ్యూ లేదా మెరిట్ ఆధారంగా ఎంపిక చేయవచ్చు. ఎంపికైన వారికి ఏడాది ట్రైనింగ్ ఉంటుంది. వీరికి నెలకు రూ. 10,560 నుంచి 11,040 వరకు ఇస్తారు.

# సంపాదకీయం

## వానను ఒడిసిపట్టే యాగం ఎప్పుడు?

ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా మనం వాన కోసం ప్రార్థించాలా? లేక పడిన కొన్ని చినుకులనైనా వృథా కాకుండా ఒడిసిపట్టాలా? వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వరుణ యాగం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.వర్షం కోసం ప్రార్థనలు చేయడం మన సంప్రదాయంలో భాగమే. ప్రకృతిని దేవతగా భావించి వర్షాన్ని కోరుకోవడం అనాదిగా వస్తున్న విశ్వాసం. అయితే వ్యక్తిగత విశ్వాసం ఒకటి,ప్రభుత్వ పాలనలో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానం మరొకటి.యాగం లేదా ప్రార్థన వల్ల వర్షం కురుస్తుందని నిరూపించే శాస్త్రీయ ఆధారాలు లేవు. రుతుపవనాల కదలిక, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణ పీడన వ్యవస్థలు, గాలుల దిశ, ఎల్‌నినో వంటి సముద్ర వాతావరణ పరిణామాలు వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రక్రియలను మనిషి తన ప్రార్థనలతో నియంత్రించలేడు.కానీ వర్షం పడిన తర్వాత ఆ నీటిని ఎలా ఉపయోగించుకోవాలి,ఎంత నీటిని భూమిలోకి ఇంకించాలి,ఎంత నీటిని నిల్వ చేయాలి అన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంది. వర్షం తక్కువగా పడినప్పుడు నీటి కొరతను ఎదుర్కొంటాం. భారీ వర్షం పడినప్పుడు వరదలను ఎదుర్కొంటాం. ఒకే సమయంలో ఈ రెండు సమస్యలను ఎదుర్కొంటున్నామంటే సమస్య వర్షంలోనే లేదని అర్థం. వర్షపు నీటిని నిర్వహించడంలో మన వైఫల్యం ఉంది. ఇలాంటి వైఫల్యాలను అధిగమించిన రైతుల చరిత్ర తెలంగాణలో ఉంది.వాననీటిని ఒడిసిపడితే భూగర్భదాహం తీరుతుందని సంగారెడ్డి జిల్లా, కోహీర్ మండలంలోని గొడిగార్‌పల్లి రైతులు నిరూపించారు. అక్కడ సాగుభూమి 1200 ఎకరాలు. ఒకప్పుడు తాగడానికి కూడా నీళ్లు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. చినుకులు పడితే పంట, లేదంటే వలసలే. అలాంటి కరువు నేలలో 2019లోఐక్యరాజ్యసమితి సలహాదారు టి.హన్మంతరావు ఆ గ్రామస్థులను జల సంరక్షణలో భాగస్వాములను చేశారు. చతుర్విధ జలప్రక్రియ అనే ప్రాజెక్ట్‌ను అమలు చేశారు. అవి? 1. వాన నీరు 2. ఉపరితల నీరు 3. భూగర్భ నీరు 4. భూమిలో తేమను ఎలా పెంచి వినియోగించుకోవాలో చెప్పే శాస్త్రీయ పద్ధతి.ఈ ప్రక్రియలో భాగంగా వాన నీరు భూమిలో ఇంకేలా, ప్రవహించే నీరు లోతట్టుకు వెళ్లకుండా వాలుకు అడ్డంగా చిన్న గుంతలు, కందకాలు తవ్వారు. భూగర్భ జలాలు పెంచడానికి ఊట గుంతలు, పంట కుంటలు తవ్వారు. ఇదంతా గ్రామస్థుల శ్రమదానంతో చేసుకున్నారు. దీనివల్ల పడిన వర్షం అంతా ఊరి పొలిమేరలు దాటకుండా వారి పొలాల్లోనే ఇంకుతుంది. ఫలితంగా గ్రామంలోని బోర్లలో నీటి మట్టం పెరిగింది,ఇప్పుడు వారు మూడు పంటలు పండిస్తున్నారు. వానలు సకాలంలో పడనప్పుడు కూడా సాగునీటికి ఇబ్బందులు లేకుండా సేద్యం చేస్తున్నారు. తెలంగాణ రైతులు అనుసరించిన చతుర్విధ జలప్రక్రియ రాజస్థాన్‌కు స్ఫూర్తినిచ్చింది. ఇదే విధానాన్ని ఇప్పుడు రాష్ట్రమంతటా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక తయారుచేయాలి.ఒక భారీ వర్షం కురిసి గంటల్లోనే ఆ నీరు వరదలా పారి వృథాగా పోయే కంటే, అదే నీటిని చిన్న చిన్న కుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, కాంటూర్ ట్రెంచ్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు, చెరువుల ద్వారా భూమిలోకి పంపడం ఎంతో విలువైనది. వర్షాన్ని కురిపించడం మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ వర్షాన్ని భూమిలోకి పంపించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. అందుకే ప్రభుత్వం వర్షాల కోసం ఒక యాగం నిర్వహించినప్పుడు, అదే సమయంలో రాష్ట్రంలోని ఎన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్విస్తున్నారు? ఎన్ని చెరువులను పూడిక తీసి పునరుద్ధరిస్తున్నారు?ఎన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నారు?ఎన్ని ఫామ్ పాండ్లను ప్రోత్సహిస్తున్నారు? ఎన్ని ప్రభుత్వ భవనాల్లో పైకప్పు వర్షపు నీటిని భూగర్భజలాల్లోకి పంపిస్తున్నారు? ఈ ప్రశ్నలే శాస్త్రీయ పాలనకు కొలమానాలు కావాలి.తెలంగాణకు నీటిని నిల్వ చేసుకునే గొప్ప సంప్రదాయం ఉంది. చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, కట్టలు మన పూర్వీకులు అభివృద్ధి చేసిన స్థానిక నీటి విజ్ఞానానికి ప్రతీకలు. కాకతీయుల చెరువుల వ్యవస్థ నుంచి గ్రామీణ కుంటల వరకు, తెలంగాణ భూభాగం వర్షపు నీటిని పట్టుకోవడానికి అనేక స్థానిక పద్ధతులను అభివృద్ధి చేసుకుంది. ప్రకృతితో కలిసి జీవించాల్సిన అవసరాన్ని అప్పటి సమాజం అర్థం చేసుకుంది.కానీ కాలక్రమంలో పట్టణీకరణ, చెరువుల ఆక్రమణలు, సహజ వాగుల మూసివేత, కాంక్రీట్ విస్తరణ, భూమిలోకి నీరు ఇంకే ప్రదేశాల తగ్గుదలతో పరిస్థితి మారిపోయింది. ఫలితంగా ఇప్పుడు వర్షం పడితే ఒకవైపు వరద, వర్షం ఆగితే మరోవైపు నీటి కొరత. ఇది కేవలం వర్షం సమస్య కాదు. ఇది నీటి నిర్వహణ సమస్య.హైదరాబాద్ వంటి నగరాల్లో వర్షపు నీటి సంరక్షణకు మరింత ప్రాధాన్యం అవసరం. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ఉండాలి. ప్రతి పాఠశాలలో ఒక నమూనా రీచార్జ్ పిట్ ఏర్పాటు చేయాలి. ప్రతి అపార్ట్‌మెంట్‌లో వర్షపు నీటి నిర్వహణ తప్పనిసరి కావాలి. ప్రతి పట్టణంలో చెరువులు, నాలాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను రక్షించాలి. వర్షం వచ్చినప్పుడు నీరు రోడ్డుపై నిలిచిపోవడం కాదు, భూమిలోకి చేరేలా పట్టణ ప్రణాళిక ఉండాలి. ప్రజలకు నీరందించే బాధ్యత ప్రభుత్వానిది. వర్షం వచ్చినప్పుడు ఒక్క చుక్క కూడా వృథా కాకుండా చూసే వ్యవస్థను నిర్మించాలి. వర్షం తక్కువైతే రైతును ఆదుకునే ప్రణాళిక ఉండాలి.మత విశ్వాసాన్ని అవమానించాల్సిన అవసరం లేదు. సంప్రదాయాన్ని తిరస్కరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ సంప్రదాయ విశ్వాసాన్ని శాస్త్రీయ నీటి నిర్వహణకు ప్రత్యామ్నాయంగా నిలబెట్టకూడదు.

## శారదానగర్ కాలనీలో కాలువ, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



రంగారెడ్డి జిల్లా జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 27:ఎల్ బీ నగర్ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ కాలనీ ఫేస్–3లో ప్రధాన సమస్యగా ఉన్న కాలువ నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటుకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సహకారం అందించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలువ, పైప్‌లైన్ పనులు సకాలంలో పూర్తయితే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి, కాలనీవాసులకు ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో శారదానగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ రావు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు దీపావళి శ్రవణ్ కుమార్, గుత్తా లక్ష్మణ్ రెడ్డి, దీపావళి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు, కాలనీ పెద్దలు, శ్రేయోభిలాషులు, మహిళా విభాగం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పెంబట్లలో ఘనంగా గ్రామసభ. సర్ , డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



సారంగాపూర్ మండల్ రిపోర్టర్,జ్యోతి ప్రభంజనం, ఆగష్టు27,:జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కొలపాక రాధా రాజు ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో సర్ స్పెషలింటెన్సివ్ రెవిషన్ కార్యక్రమంతో పాటు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.సర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహనఎన్నికల ప్రక్రియపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు సర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఫారాల నింపడం, ఆన్‌లైన్ నమోదు తదితర ప్రక్రియలను పూర్తి చేశారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బి ఎల్ ఓ లు, బి ఎల్ లు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, యువకులు ప్రజలకు సహకరించారు.డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీగ్రామ ప్రజలకు ఆధునిక సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ రేషన్ కార్డులు అందజేయడంతో రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని సర్పంచ్ రాధా రాజు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వేగం, పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, జీపీఓ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు చిరంజీవి, దొంగ జ్యోతి, రాజేందర్ రెడ్డి, విజయ, బి. రాజేష్, నాయకులు బోడుపెల్లి రాజన్న, కె. మహేష్, బి. రెడ్డి, బి. రాము, కె. లక్ష్మణ్, ఏఎన్ఎం నిర్మల, అంగన్వాడీ టీచర్లు నర్సమ్మ, మీనా, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ నగర్‌లో సీనియర్ సిటిజన్స్ భవనం ప్రారంభం



ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు 27: బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్‌లో మరమ్మతులు చేపట్టిన సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనం (వృద్ధుల సేవా కేంద్రం) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పెద్దల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సీనియర్ సిటిజన్లు తమ విశ్రాంతి సమయాన్ని ప్రశాంతంగా గడపడంతో పాటు పరస్పరం ఆలోచనలు, అనుభవాలను పంచుకునేందుకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు బసవయ్య, కాలనీ అధ్యక్షులు సాంబశివరావు, మాజీ అధ్యక్షులు కూర్మారావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరస రాజు, మాజీ అధ్యక్షులు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి, కోశాధికారి శివాజీ, సంయుక్త కార్యదర్శులు కృష్ణమూర్తి, ధనుంజయ్ కుమార్, దామోదర్ రెడ్డి, సభ్యులు చంద్రశేఖర్, సత్యనారాయణ, నరసింహారెడ్డి, డి.కృష్ణ, పతంగి శ్రీధర్, సుధీర్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తుది ఓటరు జాబితాపై గ్రామసభ



చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో తుది ఓటరు జాబితాలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తుది ఓటర్ల జాబితాను గ్రామసభలో చదివి వినిపించారు. ఇంకా మ్యాపింగ్ కాని ఓటర్ల జాబితాను బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు)పరిశీలించి, సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేస్తారని గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు జాబితాలోకొనసాగేందుకు అవసరమైన ఏవైనా రెండుఆధార పత్రాలను (ప్రూఫ్స్) సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. గ్రామసభలో చౌటుప్పల్ ఎమ్మార్వో వీరాబాయి,గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు 27:ఉమ్మడి



హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి



హయత్‌నగర్ డివిజన్‌కు చెందిన మహిళా నాయకులు, మహిళా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు ఆయన నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి విశేషంగా సేవలందించిన ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మహిళా నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొని కళ్లెం నవజీవన్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## విజయవంతంగా గ్రామసభ

### ఏ ఈ ఆర్ ఓ మహమ్మద్ నయీముద్దీన్.



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 27:ఎస్ ఐ ఆర్ –2026 ఫేజ్ –3 లో భాగంగా నాంపల్లి మండల కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ విజయవంతమైనట్లు నాంపల్లి ఏఈఆర్ఓ మహమ్మద్ నయీముద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనలో మ్యాపింగ్ కానీ ఓటర్లందరికి నోటీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. మ్యాపింగ్ కానీ ఓటర్లు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు ఆధార వివరాలు సంబంధిత బి ఎల్ వో లు ఓటర్లకు వివరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ అయినప్పటికీ ఏవైనా లోపాలు అసమానతలు గుర్తించిన ఓటర్లు కు నోటీసులు ఇవ్వబడతాయని అన్నారు. వారు కూడా సంబంధిత పత్రాలతో నిర్దేశించిన తేదీలలో హియరింగుకు రావాలని తెలిపారు. కొత్తగా ఓటరు గా నమోదు కావాలనుకునే అర్హత కలిగిన పౌరులు ఫారం 6 సమర్పించవచ్చు.ఓటర్ పేరు తొలగింపుకు ఫారం 7, ఓటర్ వివరాల్లో మార్పులు సవరణలు లేదా నివాసం మార్పు కోసం ఫారం 8 సమర్పించవచ్చు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ, బి ఎల్ వో లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు అందిన నోటీసులకు సరైన పత్రాలు అందజేయాలి

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 27(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలో రెండో దశ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చిట్యాల: ఓటరు జాబితా సవరణలో భాగంగా రెండో దశ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఉరుమడ్ల, తాళ్లవెల్లంల గ్రామాల్లో బీఎల్ఏల ఇన్చార్జ్ పల్లపు బుద్ధుడు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో తమ పేర్లు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, నోటీసులు అందిన ఓటర్లు సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు సరైన ధ్రువీకరణ పత్రాలు అందజేసి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని సూచించారు.నోటీసులు అందిన ప్రతి ఓటరు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెసిడెన్షియల్ సర్టిఫికెట్‌తో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారు వాటిని జతచేసి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని కోరారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పల్లపు బుద్ధుడు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉరుమడ్ల గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి శ్రీభానుశ్రీ భిక్షం, తాళ్లవెల్లంల గ్రామపంచాయతీ సర్పంచ్ జోగు సురేష్ పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. నోటీసులు అందిన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా



అవసరమైన పత్రాలను బీఎల్ఓలకు అందజేయాలని వారు కోరారు.చిట్యాల మండలంలో 100 శాతం ఓటర్ల నమోదు లక్ష్యాన్ని సాధించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని పల్లపు బుద్ధుడు కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సౌమ్య విద్యా మందిర్లో రక్షాబంధన్ వేడుకలు.

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 27(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను బుధవారం విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు ఆప్యాయంగా రాఖీలు కట్టి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.రాఖీ పండుగ ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగను నిర్వహించుకుంటామని తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఒకరినొకరు రాఖీలు కట్టుకోవడంతో సందడి నెలకొంది. సోదరభావం, పరస్పర గౌరవం, ఆప్యాయత వంటి విలువలను పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బొడిగె



విజయకుమార్ గౌడ్, ఉపాధ్యాయులు రుద్రారపు లావణ్య, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, గంధమల్ల చర్విత, రేగులగడ్డ ప్రశాంతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరుగా నమోదు చేయించుకోవాలి

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 27(జ్యోతి ప్రభంజనం):ఓటరు సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల్లో జరిగిన వివిధ రకాల తప్పిదాల కారణంగా ఓటరు జాబితాలో పేర్లు కోల్పోయిన వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుని తిరిగి ఓటరుగా నమోదు కావాలని చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దులపురి క్రిష్ణ సూచించారు. బుధవారం చిట్యాల మున్సిపాలిటీలోని 11వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎద్దులపురి క్రిష్ణ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో తమ పేర్లు తొలగిపోయినట్లు గుర్తించిన అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు ఉండేలా చూసుకోవాలన్నారు.అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని సైతం సవరణ చేయించుకోవాలని సూచించారు. వార్డు పరిధిలో అర్హులైన



ఓటర్లందరికీ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మిసైదులు, 11వ వార్డు కౌన్సిలర్ బొబ్బల సందీప్‌రామ్‌రెడ్డి, బీఎల్ఓలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హోరెత్తిన ధర్నా.

## సమస్యలు తీర్చకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక!

మహబూబ్‌నగర్ మహబూబ్‌నగర్ టౌన్):ఉద్యోగ, ఉపాధ్యాయుల సుదీర్ఘకాల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర నాయకత్వం పిలుపు మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్ గేటు వద్ద భారీ జిల్లా స్థాయి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఛైర్మన్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2వ వెంటనే ప్రకటించాలని మరియు నిలిచిపోయిన ఇతర డిమాండ్లను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని, తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, చంద్రనాయక్ తో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

## దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి డిగ్రీ కళాశాలలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం

హైద్రాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు 27:రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు విద్యార్థులకు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్రగతి డిగ్రీ కళాశాలలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది విద్యార్థులు హాజరై రోడ్డు భద్రతపై అవగాహన పొందారు. మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె. ఆది రెడ్డి, చంద్రాయణగుట్ట జోన్ ఏసీపీ వి. చంద్రకుమార్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై వివరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. "వేగం కంటే ప్రాణం విలువైనది.. గమ్యస్థానానికి కొన్ని నిమిషాలు ఆలస్యంగా చేరినా పర్వాలేదు కానీ, సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి" అని సూచించారు. యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ ధరించాలని అధికారులు సూచించారు. హెల్మెట్, సీటు బెల్ట్ కేవలం ట్రాఫిక్ నిబంధనల కోసం మాత్రమే కాకుండా స్వీయ రక్షణకు అత్యంత ముఖ్యమైన భద్రతా చర్యలు అని వివరించారు.అతివేగం.. ప్రాణాంతకంఅతివేగంగా వాహనాలు నడపడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని, చిన్న పొరపాటు కూడా ప్రాణాంతక ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడపడం, పోటీగా డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు .వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగం వద్దుడ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడటం, సందేశాలు పంపడం, సామాజిక మాధ్యమాలను చూడటం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని తెలిపారు. వాహనం నడుపుతున్న సమయంలో పూర్తిస్థాయి దృష్టి రహదారిపైనే ఉండాలని సూచించారు.రాంగ్ రూట్ డ్రైవింగ్‌కు స్వస్తిరాంగ్ సైడ్‌లో వాహనాలు నడపడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే అవకాశం తగ్గిపోతుందని, ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని




విద్యార్థులకు సూచించారు.లేన్ క్రమశిక్షణ.. సురక్షిత అధిగమనం రహదారులపై లేన్ క్రమశిక్షణ పాటించడం, అవసరం లేకుండా లేన్ మార్చకపోవడం, ఇతర వాహనాలను అధిగమించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడినవారమ వుతామని పేర్కొన్నారు.మద్యం సేవించి వాహనం నడపొద్దుమద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్ నిర్ణయ సామర్థ్యం, నియంత్రణ తగ్గి ప్రమాదాల ముప్పు పెరుగుతుందని అధికారులు హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమే కాకుండా డ్రైవర్‌తో పాటు ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని వివరించారు.విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహనను తమ కుటుంబ సభ్యులు,స్నేహితులు,పరిచయస్తులకు కూడా తెలియజేయాలని అధికారులు కోరారు.ట్రాఫిక్ నిబంధనలు పోలీసుల కోసం కాదు.మన ప్రాణాల కోసం.ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసినప్పుడే నిజమైన విజయం"అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

## మునుగోడు తహసీల్దార్‌కు యూత్ కాంగ్రెస్ నేత హరికృష్ణ వినతి

మునుగోడు,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 27: కోతులారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ ఆస్తిగాఉన్న ఇసుకను భారీగా తవ్వి తరలిస్తున్నారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ కోతులారం గ్రామ శాఖ అధ్యక్షుడు హరికృష్ణ మునుగోడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.బ్రిడ్జి నిర్మాణ పనుల పేరుతో జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా వందల టన్నుల ఇసుకను తవ్వి తరలిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాణ్యత తక్కువగా ఉన్న ఇసుకను వినియోగించడంతో పాటు, ఇసుక కోసం చాలా లోతుగా తవ్వకాలు చేపడుతున్నారని, దీనివల్ల బ్రిడ్జి నిర్మాణ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించి సుమారు 1,200టన్నుల ఇసుకను డంప్ చేసినట్లు హరికృష్ణ ఆరోపించారు.గ్రామానికి చెందిన సహజ వనరైన ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తరలించడం వల్ల గ్రామానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని, అనుమతులు లేకుండా తవ్విన ఇసుకను బ్రిడ్జి నిర్మాణంలో వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని



కోరారు. ఇసుక తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.గ్రామ ఆస్తిని పరిరక్షించడంతో పాటు బ్రిడ్జి నిర్మాణ నాణ్యత విషయంలోనూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హరికృష్ణ విజ్ఞప్తి చేశారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి పోలీసుల ఆత్మీయ రాఖీ

సికింద్రాబాద్, జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 27:గోపాలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో, సహచరి సభ్యుల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమం ఆప్యాయత, స్నేహభావాలతో నిండిన వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను గుర్తుచేసుకుంటూ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్?ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. రాఖీ వేడుకలను నిర్వహించేందుకు చొరవ చూపిన మల్కాజ్‌గిరి సీపీ సుమతి కృషిని సభ్యులు అభినందించారు.సమాజ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మహిళల భద్రత, ప్రజలతో సానుకూల సంబంధాల పెంపునకు పోలీస్‌శాఖ కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ వేడుక చాటిచెప్పింది. పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ప్రజల మధ్య ఆత్మీయతను పెంచేలా కార్యక్రమం సాగింది.ఈ కార్యక్రమంలో



గోపాలపురం పోలీస్‌స్టేషన్ సీఐ ఎం. మధుకుమార్, ఎస్ఐలు, మహిళ పోలీస్ సిబ్బంది, సహచరి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రభంజనం



# గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

### : అడిషనల్ ఏఈఆర్ఓ నాంపల్లి నాగలక్ష్మి.



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 27:గ్రామసభ ను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ ఏఈఆర్ఓ నాంపల్లి నాగలక్ష్మి తెలిపారు. గురువారము ఎస్ ఐ ఆర్ –2026 ఫేజ్ –3 లో భాగంగా గోషామహల్ నియోజకవర్గం నాంపల్లి మండలం ఇస్సామియా బజార్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన గ్రామ సభ లో ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనలో మ్యాపింగ్ కానీ ఓటర్లందరికి నోటీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. మ్యాపింగ్ కానీ ఓటర్లు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు ఆధార వివరాలు సంబంధిత బి ఎల్ వో లు ఓటర్లకు వివరిస్తారని తెలిపారు. మ్యాపింగ్ అయినప్పటికీ ఏవైనా లోపాలు అసమానతలు గుర్తించిన ఓటర్లు కు నోటీసులు ఇవ్వబడతాయని అన్నారు. వారు కూడా సంబంధిత పత్రాలతో నిర్దేశించిన తేదీలలో హియరింగుకు రావాలని తెలిపారు. కొత్తగా ఓటరు గా నమోదు కావాలనుకునే అర్హత కలిగిన పౌరులు ఫారం 6 సమర్పించవచ్చు. ఓటర్ పేరు తొలగింపుకు ఫారం 7, ఓటర్ వివరాల్లో మార్పులు సవరణలు లేదా నివాసం మార్పు కోసం ఫారం 8 సమర్పించవచ్చు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ, బి ఎల్ వో లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకం ప్రారంభానికి సిద్ధం

**– ప్రారంభించనున్న రాష్ట్ర మంత్రులు**
**– హెలిపాడ్ ఎత్తి పోతల పథకం కెనాల్ సభా స్థలాన్నీ పరిశీలించిన కలెక్టర్ అంకిత్**
**– పనులన్నీ సకాలంలో పూర్తిచేయాలి**
**– పినపాక ఎమ్మెల్యే పాయంతో కలిసిఅధికారులకు సూచనలు కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ఖమ్మం జిల్లా అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తి పోతల పథకం ఈనెల 29న శనివారం ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు భారీ మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు హజరుకానున్నారు. సీతారామా ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్ల పాడు ఎత్తిపోతల పథకం పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా ఈ





కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు భద్రాద్రి జిల్లా చేరుకునే అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరు ప్రాంతంలోని హెలిపాడ్ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న పనులపై సలహాలు, సూచనలు అదికారులకు తెలియజేశారు. అదేవిధంగా మంత్రులు ప్రారంభించనున్న సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో మారెళ్లపాడు ఎత్తి పోతల పథకం కెనాల్, గొందిగూడెం–జీకొత్తూరు పల్లె ప్రకృతి ముందుగల ప్రాంతంలోనిసభా స్థలాన్నీ పరిశీలించారు. ఈ క్రమంలో అక్కడ కొనసాగుతున్న పనులను త్వరితగదిన పూర్తి చేయాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. పథకం ప్రారంభోత్సవ సందర్భంగా పనులతీరు మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. మంత్రుల పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ వసతులు కల్పించాలని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో గంజాయి రాయుళ్లు

**– డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు**
**– ముత్తుపదార్థులకు దూరంగా ఉండాలి**
**– త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):కొత్తగూడెం త్రీ టౌన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మత్తు పదార్థాల వినియోగం నుంచి వారిని బయటకు తీసుకువచ్చి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయం సరఫరా రవాణా వినియోగానికి పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని కేవలం శిక్షించడం మాత్రమే కాకుండా అవసరమైన సందర్భాల్లో చికిత్స పునరావాసం అందించడం ద్వారా వారిని తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు




సహకరించాలని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓ ఇంద్రసేన రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మా బెనిఫిట్స్ మాకు ఇవ్వాల్సిందే

**– పిఆర్సీ అమలు చేయాలి**
**– పెండింగ్ బిల్స్ ను విడుదల చేయాలి**
**– జేఏసీ నాయకుల డిమాండ్**
**– కలెక్టరేట్ వద్ద మహాధర్నా సక్సెస్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):మాకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేయడం జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత ప్రభుత్వం కూడా బెనిఫిట్స్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపిందన్నారు కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి మా బెనిఫిట్స్ మాకు ఇవ్వాలని వేడుకున్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రక్కనున్న ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఉద్యోగులు గెజిటెడ్ అధికారులు ఉపాధ్యాయులు కార్మికులు అండ్ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా టీజేఈ జేఏసీ జిల్లా





చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్యలు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకుంటే దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. 2వ పిఆర్సి అమలు చేయడంతో పాటుగా ఆరు డిఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలుచేయాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్స్ 2000 కోట్లు ప్రతి నెల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీంను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందన్నారు. వచ్చే నెల కూడా హైదరాబాదులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి..తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన దీర్ఘకాలిక డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్ట్రియాల్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమాల పిలుపులో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు ఆయన హాజరై సంపూర్ణ సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అలాంటి వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగుల జీవితాలకు భద్రత లేని సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, పూర్తిస్థాయి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్)ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు పలువురు పాల్గొన్నారు.

# మనిషి జీవితం

ఆఖరి పేజీ ఏమిటో
అసలు ఎలా ఉంటుందో
తెలియకుండానే చదువుతున్న
పుస్తకమే ఈ జీవితం
మొదటి పేజీ మన పుట్టుక
చివరి పేజీ మన మరణం
మధ్యలో రాసుకునే ప్రతి అక్షరం
మన జీవితం చేసే ప్రయాణం
కొన్ని పేజీలు కన్నీళ్లతో
కొన్ని పేజీలు నవ్వులతో
కొన్ని జ్ఞాపకాలతో నిండితే
మరికొన్ని గాయాలుగా మిగులుతాయి
ఎవరు ఏ పేజీ రాస్తారో
కాలమే నిర్ణయిస్తుంది
ఎన్ని మలుపులు వచ్చినా
మనమే కథానాయకులం
గెలుపు ఒక పాఠమైతే
ఓటమి మరో పాఠం
పడిపోయిన ప్రతిసారీ
లేవడమే నిజమైన జీవితం
నిన్నటి పేజీ తిరగదు
రేపటి పేజీ తెలియదు



ఈరోజు అనే పేజీని మాత్రం
అందంగా రాయాలి మనం
ఆఖరి పేజీ మూసేలోపు
మన కథను చదివినవారి హృదయాల్లో
ఒక మంచి జ్ఞాపకంగా మిగిలితే
అదే జీవితానికి అసలైన అర్థం.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.ఆంధ్రప్రదేశ్ చరవాణి :9866179385

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**